## 4

# శ్రద్ధాంజలి

"వారి ఆత్మశాంతికై రెండు నిమిషాలు మౌనంగా నిలబడదాం" అందరూ లేచి నిలబడ్డారు.

కిషన్ రావు కూడా లేచి నిలబడ్డాడు. హాల్లో నిశ్శబ్దమేర్ప డింది. ఉదయంనుండి తిండి లేని కడుపులో నిశ్శబ్దాన్ని ఫీలయ్యాడు. లోన బయట అంతా నిశ్శబ్దం. శబ్దమంతా మెరుస్తున్న బూట్లకిందా, పాలిష్ లేని చెప్పుల కిందా, తెగిన స్లిప్పర్స్ కిందా దాక్కున్నట్టుంది. నిశ్శబ్దపు విశ్వరూపాన్ని చెరిపేస్తూ అప్పుడప్పుడు కుర్చీ జరిగిన చప్పుడు. నిలబడడానికి కాళ్ళు సవరించుకుంటున్న చప్పుడూ.... నకిలీ నిశ్శబ్దంలో ముంచేసినట్టు నిలబడ్డాడు కిషన్‌రావు. కళ్ళు మూసు కున్నాడు. అంత దాకా జరిగిన ఉపన్యాసాలు వినిపిస్తున్నట్టయ్యింది.

* * *

ఉదయం నుండి తిరిగి తిరిగీ అలసిపొయ్యాడు. అద్దెగది జ్ఞాపక మొచ్చింది. వెళ్ళాలను కున్నాడు. జేబులో డబ్బులు ఎక్కువ లేవు. నడిచే వెళ్లాల్సిన స్థితి. నడిచే వెళ్దామను కున్నాడు, నడుస్తు న్నాడు. చౌరస్తా దాటి యింటివైపు-ఆంధ్ర సారస్వత నిలయం ముందు బోర్డు కనిపించి, మైకులో ఉపన్యాసం వినిపించింది. ఠకీ మని ఆగిపొయ్యాడు. ప్రముఖ రచయిత గంగాధరంకు శ్రద్ధాంజలి. అనుకోకుండానే లోనికి అడుగు వేసాడు. గంగాధరం జ్ఞాపకం రాగానే హృదయమంతా నీరయి పోయింది. నాలుగు నెలల క్రితం కలుసు కున్నప్పుడు ఎంత ఆదరణ చూపించారు? ఎంత చనువుగా మాట్లా డారు? 'మీ రచనల మీద థీసిస్ రాస్తా నండీ'-అంటే, ఈ తెలుగు

దేశపు విశ్వవిద్యాలయాలలోనేనా? అని నవ్వారు. ఆ నవ్వు యిప్పుడర్థ మౌతోంది. హాల్లో జనం క్రిక్కిరిసి వున్నారు. కొంతమంది వేదిక నలంకరించి వున్నారు. అతనెవరో సాహిత్య అకాడెమీకి సంబంధించిన వ్యక్తి మాట్లాడుతున్నాడు-"అతను నా బాల్య మిత్రుడై నందుకు నాకు గర్వంగా వుండేది. అతను లేదని తెలిసి ఎంతో దుఃఖంగా వుంది. ఎంత గుండె గలవాడనీ, అంతటి వాడే గుండె జబ్బుతో కన్ను మూయాలా? ఇంత దారుణం మరొకటుంటుందా? ఈ సంవత్సరం ఆతని నవలకు అవార్డు యివ్వాలని నిర్ణయింపబడింది. అయితే ఆవార్త ప్రకటించక ముందే హఠాత్తుగా అదృశ్యులై పొయ్యారు-"

పది, పదిహేనేళ్ళక్రితం యివ్వాల్సింది. ఇప్పటికిద్దామను కుంటున్నారా? అతన్ని అవమాన పర్చడమే అయి వుండేది. ఆ కమెటీ మెంబర్లెవరో వాళ్ళ తెలివి తక్కువ తనం ప్రదర్శించుకోక ముందే వారు వెళ్ళిపొయ్యారు-అనుకున్నాడు కిషన్‌రావు.

అతను బ్రతికున్న రోజుల్లో, అతను స్నేహితుడని చెప్పుకోవ డానికి సిగ్గుపడేవాళ్ళు. ఎందుకూ? ఆర్థికంగా బీదవాడు గనక, ఏదో ప్రయివేట్ సంస్థలో గుమస్తా వుద్యోగం చేస్తున్నాడు గనుక - అంతకు ముందు చిన్నతనంలో వూళ్లో గొర్రెల్నీ, బర్రెల్నీ కాసాడు. బతుకు దెరువు కోసం నగరం చేరి, దుకాణాలల్లో, హోటళ్ళల్లో చిన్న చిన్న వుద్యోగాలెన్నో చేసాడు. కాలేజీ కెళ్ళి డిగ్రీ తీసుకోలేదు. అయినా బాగా చదువుకున్నవాడు, ప్రతిభావంతుడు. అతని మరణం వల్ల కలి గిన నష్టం ఎంతో, నిజంగా ఆ వేదిక మీద కూర్చున్న వాళ్ళల్లో ఒక్క రికీ తెలియదు. కిక్కిరిసి నిలబడ్డ ఈ ప్రజలకు తెలుసు. నేటి కవులూ- రచయితలు ప్రజల్లో బతుకుతున్నారు, బతుకుతారు. ఈ పండితు లనబడే శుంఠలకు వాళ్ళ గురించేమీ తెలియదు. వీళ్ళేదో విడమర్చి చెబుతారని వెర్రిగా పరిగెత్తుకొస్తారు జనం-బాధగా మూలిగింది కిషన్ మనసు.

వేదిక మీద మనిషి మారినట్టున్నాడు విషయం మారలేదు. 'తెనుగు భాష'లో మాట్లాడుతున్నాడు. కిషన్రావ్ తలెత్తి చూశాడు. ప్రొఫెసర్ రామభద్ర రావు, తెల్లని లాల్చీ, ధోవతి, పొడుగు పాటి బొట్టూ, చెక్కణం కొంతచేసి వదిలేసిన రాయిలా నున్నటి, ఎర్రటి బట్టతల....చెవులపై నుండి వెనక్కి నల్లగా కొద్దిపాటి వెంట్రుకలూ....

నన్నయ వారసుడి లాగా వున్నాడు. "....యతనిది జక్కని తెనుగు నుడికారముతో యొక ప్రత్యేకమైన శైలి. వ్యవహారిక భాషాభి వృద్ధికి యతడంకితమై గంకణము గట్టుకొనినాడు. నాకు ప్రాచీన సాహిత్య మెంత అభిమానమో, ఆధునిక సాహిత్య మనిన యంత ఆద రణ, యందువలన గంగాధరం గారి యనేక గ్రంధముల జదివితిని. యతడు సామాన్యుని జీవిత సంవిధానమును, చిత్రీకరించిననూ యందు ప్రాచీన సాహిత్యమును జీర్ణించుకొనిన విషయము సుస్పష్టముగా గని పించును. అతడు నిజముగా మేధావి. జీవితమూ సాహిత్యమూ యత నికి విభిన్న రంగములు గావు. జీవితమే సాహిత్యము, సాహిత్యమే యతని జీవితము...."

అసహ్యం వేసింది కిషన్రావుకు. అక్కడి నుండి కదిలాడు. బయటి కొచ్చేశాడు. ఛీ ఛీ అనుకొన్నాడు. సంస్కారహీనులు, సాహిత్యం పట్ల అవగాహన లేని వాళ్ళు-గంగాధరం గారి రచనల మీద రీసెర్చ్ చేస్తానంటే ఎంత హేళనగా నవ్వాడు వాడూ? ఈడియట్! మన యూనివర్శిటీ ఇంకా ఇలాగే వుంది. బెంగాలి అతనెవరో గంగా ధరం గారి పుస్తకాలమీద బెంగాలీలో పరిశోధనా వ్యాసం రాసి సబ్మిట్ చేశాడుటండీ అంటె- 'నువ్వు కూడా యక్కడికే వెళ్ళి పరిశో ధించెదవా బాబూ!'-అని ఎంత చులకన చేశాడు? ఇక్కడ ఇప్పుడేమో పొగడుతూ మాట్లాడుతున్నాడు-ఆలోచిస్తూ బయట వరండాలో నిల్చు న్నాడు. జేబులు తడుముకున్నాడు. సిగరెట్లు లేవు. ఆ విషయం

అతనికి అంతకుముందే తెలుసు. అయినా అలవాటు ప్చ్. సాహిత్యం చదవకుండా వుండాల్సింది....నిరాశ!

కిషన్ రావు సాహిత్యం చదువుకుని పట్టాపుచ్చుకున్నాడు. ఒకానొక ఆమాత్య శేఖరుని కుమార శేఖరుడు వ్యాపారం చేద్దామనుకుని స్థాపించిన కళాశాలలో లెక్చరర్‌గా ఉద్యోగధర్మం నెరవేర్చాడు. అలా ఆరు నెలలు గడవక ముందే, ఏవో రాజకీయాల కారణంగా కళాశాల మూతపడగా స్టాఫ్ అందరితోపాటు ఉద్యోగి కిషన్‌రావు నిరుద్యోగైనాడు. గొప్ప అన్వేషిలా తయారయ్యాడు.

'ఒకవైపు సాహిత్యం ఎదిగిపోతోంది. విశ్వవిద్యాలయాల్లో సాహిత్య విభాగం కుంచించుకు పోతోంది. అప్పటి పద్యాలు బట్టీ బట్టి ఈ రోజు ప్రొఫెసరయినంత మాత్రాన సాహిత్య పరిజ్ఞానం వుందని ఎలా అనగలం? యిప్పటి సాహిత్యానికి చోటిస్తే, తమకు చెప్పడం చేత కాదు కదా! చెప్పకపోయినా విద్యార్థులు చదివి తమను మించి పోతారని భయం. పట్టుపంచె భుజాల మీంచి సర్రున జారి పోతుందేమోనని ఆందోళన. ఇక్కడ ఎంతసేపటికీ నన్నయ కవితా కలితార్థ యుక్తొ, లేకపోతే తెలుగు దేశంలో అవధానాల గురించో పరిశోధించడం తప్పిస్తే ఏమీ లేదు' కిషన్ మనసు మసలుతోంది. ఆవేశం పొగలు గక్కుతోంది...."ప్రాచీన సాహిత్యం ఈ కాలానికి పనికిరాదని తెలుసుకోరు వీళ్ళింకా. మొహంజోదారో త్రవ్వకాలు బయటపడ్డాయి. పనిముట్లూ కుండలూ, ఆయుధాలు వగైరా, దాంతో అప్పటి జీవిత విధానం తెలిసింది. అంతే- ఆ పనిముట్లు ఆ ఆయుధాలు, ఆ వస్తువులు ఇప్పటి కాలంలో వుపయోగించలేం కదా! అదొక పునాది లాంటిది అంతే! యిప్పుడు నివాస యోగ్యమైన యిల్లు లాంటిది మాత్రంకాదు. చదువు పునాదుల దగ్గరే నిలిచిపోతే, ఆపైన పెరిగేదంతా చదివే దెప్పుడు? ఆ పెరిగే దాంట్లో మంచీచెడు విమర్శించుకునే దెప్పుడు! పాత వివరణలు, పాతవ్యాఖ్యానాలు మళ్ళీ మళ్ళీ వల్లించడం తప్పిస్తే

ప్రాచీన సాహిత్యం నుండి కొత్త విషయాల్ని పిండి, కొత్త తరానికి కొత్త కోణం లోంచి అందించే వాళ్ళు లేరు కదా! అలా చేద్దామన్న ఉద్దేశ్యం విశ్వవిద్యాలయాల్లో కనిపించడం లేదు కదా!....వీళ్ళకు కామన్ సెన్స్‌లేదు. ప్రాచీన సాహిత్యాన్ని జీర్ణించుకున్నందుకు గొప్ప వాడట గంగాధరం. అందుకే మేధావి అయ్యాడట. పూర్ ఫెలో ఏదో సీనియారిటీతో ప్రొఫెసరయ్యాడు కాని, నిజంగా తెలుగు దేశంలోని ఒక గొప్ప రచయిత ఎందుకు గొప్పవాడయ్యాడన్నది తెలుసుకోలేదు. సైంటిఫిక్ ఎప్రోచ్‌తో, సోషల్ కాన్షస్‌నెస్‌తో కథల్రాసాడు గనక గొప్పవాడయ్యాడు. సగటు మనిషి జీవితం సమస్యల పుట్ట అతని మనుగడే ఒక పెద్ద సమస్య. ప్రతి క్షణం గండాలే. జ్వలించడమే వేదనలే. అలాంటి బ్రతుకుల్లో జరిగే అతి సామాన్య సంఘటనల నుండి అసాధారణ కథల్ని రాసాడు గనక గొప్పవాడు. సాహిత్యానికి ఒక గొప్ప ప్రయోజనం వుందనుకున్నాడు గనక-ఆకలి, అజ్ఞానం, దరిద్రం, నిరుద్యోగం వంటి వాటితో సమాజం రోగ గ్రస్తమైంది గనక, డయగ్నోస్ చేయగల కథల్ని రాశాడు గనక, గొప్పవాడ య్యాడు. రాజకీయాలు సిద్ధాంతాలు, ప్రజలు, గొడవలు ఎందుకూ? అని అనుకోలేదు గనక, కీర్తి కోసం, నాలుగుడబ్బులు రాలడానికోసం, ధనిక వర్గం కోసం, సరదాగా కాలక్షేపం కోసం కథలు రాయలేదు గనక, గొప్పవాడయ్యాడు....

కిషన్‌రావు వెళ్ళిపోదామనుకున్నాడు. కాళ్ళు కదల్లేదు. ఉదయం నుండి తిరుగుడే-అందుకు తగిన తిండి తిన్లేదు-ఆకలి కోపంగా వుంది.

....ఏం వాగాడు యింతకు ముందూ? గంగాధరము గారి యనేక గ్రంధముల జదివితిని అనా? ఓరి వెర్రివాడా నువ్వు చదివి నందుకు అతను గొప్పవాడు కాలేదు. కాలేదని తెలుస్తూనే వుంది. ప్రబంధనాయిక వంపుల వర్ణనల్ని దాటి రాలేదు గనక అర్థం కాదు.

పక్కనే వున్న థియేటర్లో హిందీ మూవీ మ్యాట్నీ వదిలినట్టు న్నారు. జనం జనం ఎంత జనం? కొన్నిమాత్రమే రాసినా గొప్ప కథల్ని రాసి యవ్వనంలోనే కన్ను మూసిన రచయిత - పెద్ది రాజు ఎక్కడో రాసినట్టు-నేల ఈని పుట్టుకొచ్చినట్టు, జ.....జ.....జ..... జనం! గజిబిజి గజిబిజి, ఇందులో గంగాధరంగారి గూర్చి ఎంత మందికి తెలుసు? తెలిసినా తెలియకపోయినా వీళ్ళే నయం.ఎవరిమట్టుకు వాళ్ళు వెళ్ళిపోతున్నారు. లోన హాల్లో వున్నవాళ్ళలా పనిగట్టుకుని ఆయన గురించి తెలిసిందీ తెలియనిది, వాగడం లేదు....

వచ్చేవాళ్ళూ పోయేవాళ్ళూ, చిన్నగా తలనొప్పి మొదలయ్యింది. నిలబడడమే కష్టంగా వుంది. లోన హాల్లోకి తిరిగాడు. లోన జనం అప్పటంతగా లేరు. క్రమంగా పల్చబడుతున్నారు.

"మమ్మల్ని విడిచి ఎక్కడికి పోయ్యావయ్యా తెలుగు కథకుడా గంగాధరం! సాహిత్య లోకంలో మేరు పర్వతం.

నువ్వు లేవు -

నువ్వు సృష్టించిన ప్రతి పాత్రలో నువ్వు కనిపిస్తున్నావు"- మైక్ ముందు ఎవరో నాయకుడు కవితాగానం చేస్తున్నాడు. ఆశ్చర్యం? నాపక్కతన్ని అడిగితే చెప్పాడు. ఆయన మంత్రిగారుట! చదువు రాకున్నా మంత్రి కావొచ్చు. మంత్రైన వాళ్ళు కవులుకూడా కావొచ్చన్నమాట! అదేం చిత్రమో ఈ మధ్య అధికారులకీ, కలెక్టర్లకీ, ప్రజా నాయకులకీ అందరికీ కవిత్వం రాయడం మహచెడ్డ యిష్టం అయిపోతోంది. ఇంకేం ఎందుకూ పనికిరాని ఆ వాక్యాల్ని రేపు ప్రముఖ పత్రికలు తమ ముఖాల మీద ప్రచురించుకుంటాయి. వాళ్ళ రాజకీయా లేవో వాళ్ళుచూసుకోక మరోపక్క సాహిత్యాన్ని కెలకడ మెందుకు? ఛీ....ఛీ....

తను గదికి వెళ్లిపోకుండా, మళ్లీ లోనికొచ్చి నందుకు విచా రించాడు కిషన్‌రావు, మంత్రిగారి బొంగురుగొంతు మైకుపగిలేలా

అసహ్యంగా వుంది. మైక్ కనెక్షన్స్ తీసేసినా బావుండేది...." నేను నాతరపున ప్రజల తరపున, వారి కుటుంబానికి నా ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసు కుంటున్నాను. ఈ సారస్వత నిలయంలో గంగాధరం గారి చిత్రపటాన్ని వుంచాలన్న నిర్ణయం తీసుకున్నందుకు నేను ఈ గ్రంథాలయాధికారుల్ని అభినందిస్తున్నాను. వారి పేరుమీద ఒక గ్రంథాలయాన్ని నెలకొల్పాలని కొందరు సాహితీ మిత్రులు సూచించారు. కాని అది యిప్పుడు అనుకున్నంత సులభం కాదు. గంగాధర స్మారక గ్రంథాలయం గూర్చి ప్రభుత్వం తప్పకుండా ఆలోచిస్తుంది. ఇటీవలే బొంబాయిలో జరిగిన తెలుగు మహా సభల గురించి అధికంగా వ్యయం జరిగింది. తత్ఫలితంగా ప్రభుత్వం ఆర్థికంగా చాలా ఇబ్బందుల్ని ఎదుర్కొంటోంది. ఈ విషయం పరిశీలించి చూస్తాం....యిక....ఈరోజు....ఎక్కువసమయం తీసుకోను. వేరేసమావేశానికి హాజరు కావల్సివున్న కారణంగా యింతటితో.... యిక....రెండు మాటలుచెప్పి సెలవుతీసుకుంటాను. ఒక మహా రచయితను పోగొట్టుకున్న మనం దురదృష్టవంతులం.... తెలుగు దేశానికి తీరని లోటు....వారి ఆత్మశాంతికై రెండు నిమిషాలు మౌనంగా నిలబడదాం".

* * *

అందరి తో పాటు నిలబడి వున్న కిషన్‌రావుకు ఏవేవో ఉపన్యాసలు....ఎవరెవరివో మాటలు వినిపిస్తున్నాయి. నరాల్లో బలహీనత పెరిగింది. తలంతా తిరుగుతోంది. కాళ్ల సన్నగా వణుకుతున్నాయి.... కళ్ళలో ఏవేవో దృష్యాలు-అడవులు, అడవులు జనారణ్యాలు.... కనిపిస్తున్నాయి. అరణ్యాల్లో ఆడపిల్లలు మగ జంతువుల్ని చూసి హడలిపోతున్నారు. ఎవరువాళ్ళు ఎవరూ?గంగాధరం కూతుళ్ళా? రక్షించండని అరుస్తున్నారు. అదేమిటి ప్రభుత్వం వేలకు వేలు ఖర్చుపెడుతోంది. కుల మతాల్ని, మూఢ విశ్వాసాల్ని ప్రచారం

చేసిన విశ్వ విఖ్యాత రచయిత నారాయణశాస్త్రి గ్రంధాలు సంపుటాల కొద్దీ అచ్చేస్తున్నారు. గంగాధరం ది కనీసం చిన్నపుస్తకమైనా వేస్తే బావుండేదే? అట్టడుగు ప్రజాజీవితాన్ని వాళ్ళ భాషలోనే చిత్రించిన గంగాధరం, పుస్తకం ప్రచురిస్తే తప్పు కాబోలు. తప్పౌతుంది కాబోలు. రామారావు మాష్టారికి బహుమతిచ్చినట్టు గంగాధరంలాంటి రచయితల గురించి సమావేషాలెందుకు? విచారించడాలెందుకు? మొసలి కన్నీరు మొసలికన్నీరు - అబ్బో ప్రజల నోర్లు మూయడాలు. తడి గుడ్డలతో గొంతులు కోయడాలు. నిప్పుల మీద నీళ్ళు చల్లడాలు-గొంతెత్తి ఏడుస్తోంది గుండెపగిలి చస్తోంది.ఎవరావిడ? ఎవరూ-అతని భార్యా?? అవునవును. చేతి గాజుల్తో మొహమ్మీద రక్తం ఓట్లించుకొంటుంది. నుదిటి మీదరక్తం-రక్తం బురద-చేతుల్నిండా రక్తం. గుండెజబ్బుకాదండీ. బతగ్గూడదని చేసిన కుట్ర. ఆసుపత్రి మరణం. రాచరికం ముద్ర. డాక్టర్ల హత్య. చావలేదండీ ఆయన, చావలేదు. చావ లేదు. బొబ్బలు పెడ్తోంది .... వాళ్లెత్తుకుపోతున్నారు?

ఎటో ఏటో పోతున్నారు, గుంపులు గుంపులు విద్యార్ధులు "సిలబస్ మార్చాలి! లేకుంటే క్లాసులు బాయ్‌కాట్-ఆధునిక సాహిత్యం చదువుతాం. గంగాధరం రచనలమీద పరిశోధన- ప్రొఫెసర్ డౌన్-డౌన్-యూనివర్సిటీ జిందాబాద్"-ఆకాశం బద్దలయ్యేలా అరుస్తున్నారు. అరుస్తూనే వున్నారు. మంచి ఆశయం కోసం, సజీవంగా దహనమౌతున్నట్టుగా వున్నారు. కోట గోడల్ని పిండికొట్టగల రుద్రసైనికుడి ఆవేశంలా వున్నారు—

ఇక్కడెవరైనా వాళ్ళ కోర్కెల్ని తీరిస్తే బావుండును. వాళ్ళందర్ని ఆదరిస్తే బావుండును. గుండెపోటుకాదు. హత్య అని నిజంగా అరిస్తే బావుండును— జనానికి నిజం తెలిస్తే బావుండును—జనానికి నిజం తెలిసి, పిడికిళ్లు బిగిస్తే బావుండును—జనంలోని చైతన్యం చేతులెత్తితే బావుండును— ఏవో, ఎవరివో శబ్దాలు—అరుపులు,

కేకలు— ఏడ్పులు! చెవులు పగిలిపోతున్నాయి. గుండె ముక్క లవుతోంది. కాళ్లు పడిపోతున్నాయి. గట్టిగా ఎవరినో పిలవాలి. ఏదో అరవాలి. గొంతు దాకా వచ్చి పెగలడం లేదు. మెదడ్లో కరెంటు ప్రవహించినట్టు— తల విదిలించి-ఒక్కసారి కళ్ళు తెరిచి, తలెత్తి చూశాడు కిషన్‌రావు.

తప్పులు ఒప్పుకుంటున్న వాళ్ళలాగా తమ తప్పులకు శిక్ష విధించ మంటున్న వాళ్ళలాగా ఉరికంబ మెక్కే వాళ్ళలాగా నిదానంగా నిశ్చలంగా, తలలు వంచుకుని, గంగాధరాన్ని హత్యచేసిన హంతకుల్లాగా- అందరూ మౌన బింబాలుగా నిలబడ్డారు! ○

— ప్రభవ మాసపత్రిక
ఏప్రిల్ 1980.